కస్తూర్బాలో విద్యార్థులతో వెట్టిచాకిరీ


మాట్లాడుతున్న ఆడిట్ బృందం సభ్యులు


హాజరైన తల్లిదండ్రులు, విద్యార్థులు

- మెనూ ప్రకారం అందని ఆహారం
- ఆడిట్ బృందం తనిఖీలో వెలుగు చూసిన నిజాలు

ములకలచెరువు: 'చదువుకోవడానికి వచ్చిన మా బిడ్డల చేత పాఠశాలలో వెట్టి చాకిరీ చేయించడం మీకు తగునా' అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు కస్తూర్బా పాఠశాల బాధ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక కస్తూర్బా పాఠశాలలో ఈ నెల 20వ తేదీ నుంచి 23 వరకు సమగ్ర శిక్షా, పీఎం పోషణ్ సామాజిక తనిఖీ బృందం తనిఖీ నిర్వహించారు. ఎస్సార్పీ సుబ్బారావు, డీఆర్పీలు మల్లేష్, భగవాన్, నాగిరెడ్డిలు చేపట్టిన తనిఖీల్లో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. ఈ సందర్భంగా సోమవారం స్థానిక కస్తూర్బా బాలికల పాఠశాలలో ఆడిట్ బృందం తల్లిదండ్రులతో గ్రామసభ నిర్వహించి వాస్తవాలు బహిర్గతం చేశారు. ఆడిట్ నిర్వహించిన మొదటి రోజు 139 మందికి హాజరు వేశారు. అందులో 114 మంది బాలికలు మాత్రమే పాఠశాలలో ఉన్నట్లు గుర్తించారు. బాలికలకు ఎటువంటి జబ్బు చేసినా కేవలం పారాసీటమల్ మాత్ర తప్ప వేరేదీ ఇవ్వడం లేదని తెలిపారు. ఏఎన్‌యం, రాత్రిళ్లలో ఉండే నిర్వాహకులు బాలికల వద్ద కూరగాయలు తరిగించడం, పాత్రలు శుభ్రం చేయించడం, దుస్తులు ఉతికించుకోవడం, బాత్‌రూములు కడిగించడం చేస్తున్నట్లు వెల్లడించారు. మెనూ ప్రకారం వండిపెట్టడం లేదని.. ఆదివారం చికెన్ చేస్తే రెండేసి ముక్కలు వేసి వడ్డించం చేస్తున్నారని, మరోసారి అడిగితే అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని బాలికలు తెలిపినట్లు చెప్పారు. పరీక్షా ఫీజులు అంటూ 22 మంది బాలికల వద్ద రూ.500 చెప్పున 12,500 వసూలు చేశారు. వేడి నీటి కోసం బాలికల తల్లిదండ్రుల వద్ద నుంచి ఒక్కొక్కరికి రూ.500 వసూలు చేశారు. వాటర్‌ప్లాంట్ పని చేయకపోవడంతో బోరు నీరే దిక్కుగా మారిందన్నారు. ఇద్దరి బాలికలకు బాల్యవివాహాలు జరిగి పాఠశాలకు రాకుండా ఉండిపోయారు. దీనిపై ఎటువంటి సమాచారం సేకరించకుండా వారికి సైతం హాజరుపట్టికలో హాజరు వేస్తున్నారన్నారు. అక్కడ పనిచేసే వారు నిత్యవసర సరుకులు, కూరగాయలు రాత్రి వేళలో ఇంటికి తరలిస్తున్నారు. ఇలాంటి తప్పిదాలు మరెన్నో బృందం బహిర్గతం చేసింది. వీటన్నింటిని విన్న తల్లిదండ్రులు బాధ్యులపై ఊగిపోయారు. నిరుపేదలమైన మేము బాలికలు చదువుకోవాలని పాఠశాలకు పంపిస్తే ఇక్కడ వెట్టి చాకిరీలు చేయిస్తుండం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోసారి ఇలాంటివి పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి ప్రైవేటీకరణ విరమించుకోవాలి

- రాజకీయ కక్షతోనే అభివృద్ధిని అడ్డుకుంటున్నారన్న వైఎస్సార్ సీపీ
- బీఎస్పీ ఆధ్వర్యంలో సబ్ కలెక్టరేట్ ఎదుట మహాధర్నా


ఆస్పత్రి ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన మహాధర్నాలో పాల్గొన్న అఖిలపక్ష నాయకులు

మదనపల్లె : మెడికల్ కాలేజీ, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని ప్రైవేటీకరణ చేయాలన్న ఆలోచనను కూటమి ప్రభుత్వం తక్షణమే విరమించుకోకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని అఖిలపక్ష నేతలు హెచ్చరించారు. మదనపల్లె మెడికల్ కాలేజీ, ప్రభుత్వ ఆస్పత్రి ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, రాష్ట్ర ప్రభుత్వమే నడపాలని డిమాండ్ చేస్తూ బహుజన్ సమాజ్ పార్టీ మదనపల్లె ఆధ్వర్యంలో బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతమ్‌కుమార్ అధ్యక్షతన సబ్ కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, కాంగ్రెస్‌పార్టీ నాయకులు రెడ్డిసాహెబ్, సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, సాంబశివ, మురళి, మాలమహానాడు గుండామనోహర్, ఇతర ప్రజాసంఘాల నాయకులు హాజరై మద్దతు పలికారు. ప్రభుత్వ ఆస్పత్రి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గళం వినిపించారు. ప్రభుత్వానికి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ...ప్రజల కోసం రోడ్డెక్కి ఉద్యమాలు చేసేందుకు వైఎస్సార్ సీపీ సిద్ధమన్నారు. కూటమిప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా, రాజకీయకక్షతో మదనపల్లెపై సవతిప్రేమ కనపరుస్తోందన్నారు. మదనపల్లెను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఎంపీ మిథున్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.500 కోట్లతో మెడికల్ కాలేజీని మంజూరు చేయించారన్నారు. దానికి అనుబంధంగా పట్టణంలోని జిల్లా ఆస్పత్రిని బోధనాసుపత్రిగా మారుస్తూ, అదనపు హంగులు, అవసరమైన వసతులు కల్పించారన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమిప్రభుత్వం మదనపల్లె అభివృద్ధిపై కక్ష కట్టి మెడికల్ కళాశాల నిర్మాణపనులను నిలిపివేయించి, అనుమతులు రాకుండా అడ్డుకోవడం జరిగిందన్నారు. బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ..వందేళ్లకు పైగా నిరుపేదలకు వైద్యసేవలు అందిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రిని ప్రైవేట్‌పరం చేసే క్రమంలో రాష్ట్రప్రభుత్వం వైద్యసిబ్బందిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేసిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మురళీ, సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ నాయకులు గుండ్లూరురఫీ, ఎస్.ఏ.కరీముల్లా, కొమ్మేపల్లె శ్రీనివాసులురెడ్డి, ఆర్‌.ఐ.రమణారెడ్డి, కేశవరెడ్డి, బాలగంగాధరరెడ్డి, నరేంద్ర, కౌన్సిలర్ శ్రీనివాసులు, పాల్‌చంద్రశేఖర్, ఈశ్వర్‌నాయక్, చరణ్, మునిశేఖర్, కొత్తపల్లె మహేష్, కాంగ్రెస్ నాయకులు రెడ్డిసాహెబ్, మాలమహానాడు గుండామనోహర్, యమలాచంద్రయ్య, బీఎస్పీ నాయకులు బాలాజీ, గంగాధర్, శివ, మహేష్, ప్రశాంత్, హరి, కన్నయ్య, ఆనంద్, సారథి, రెడ్డెప్ప, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిని నిర్మిస్తుంటే అడ్డుకుంటున్నారు

- పీజీఆర్ఎస్‌లో సబ్ కలెక్టర్‌కు బాధితుల ఫిర్యాదు


ఇంటి నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారని డీఏఓకు ఫిర్యాదు చేస్తున్న బాధితుడు

మదనపల్లె : ప్రభుత్వం మంజూరు చేసిన స్థలంలో ఇంటిని నిర్మించుకుంటుంటే స్థానికంగా ఉన్నటువంటి నాయకులు అడ్డుకుంటున్నారని బాధితుడు సోమవారం సబ్ కలెక్టరేట్ ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ఫిర్యాదు చేశారు. సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ కోర్టు పనుల మీద వెళ్లడంతో ఆయన స్థానంలో డీఏఓ రాఘవేంద్ర ప్రజాసమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా బీకే. పల్లె, అమ్మచెరువుమిట్టకు చెందిన నరసింహులు, 2010లో సర్వేనెం.531/2ఏలో ప్రభుత్వం వేసిన లేఅవుట్‌లో ప్లాట్‌నెం.73 కింద రెండుసెంట్ల స్థలం కేటాయించారన్నారు. ఆర్థిక ఇబ్బందులతో నిర్మాణం చేయలేదని, ప్రస్తుతం ఆ స్థలంలో ఇల్లు నిర్మించుకుంటుంటే, స్థానిక నాయకులు మల్లికార్జుననాయుడు, శంకర్‌రెడ్డి, మహదేవ, రమణ, రామకృష్ణారెడ్డిలు అడ్డుకుని దౌర్జన్యం చేస్తున్నారన్నారు. తహసీల్దార్‌ను కలిసి పరిస్థితి వివరిస్తే, ఆమె నిర్మించుకొమ్మని చెప్పినప్పటికీ వీరు కావాలనే అడ్డుతగులుతున్నారన్నారు. పేదవాడైన తాను ఇల్లు కట్టుకునేందుదుకు సహకరించాల్సిందిగా అభ్యర్థించారు. అలాగే మదనపల్లె మండలం వలసపల్లె సర్వేనెం.774-6, 775-1లో 1970లో తన తండ్రి రంగన్న పేరుపై డీకేటీ పట్టా మంజూరైందని, అప్పటి నుంచి స్థలం తమ అనుభవంలో ఉండటమే కాకుండా పలుమార్లు పంటరుణాలు తీసుకున్నామని పెంచుపాడురోడ్డుకు చెందిన సి.నరేంద్ర తెలిపారు. అయితే...1980లో ఈ భూమిపై కొందరు వ్యక్తులు నకిలీ పట్టా సృష్టించారన్నారు. ఈ విషయమై హైకోర్టులో తాము కేసు వేస్తే, స్థలాన్ని ప్రొహిబిటెడ్ ప్రాపర్టీలో పెట్టాలని కోర్టు ఆదేశించినప్పటికీ, సబ్ రిజిస్ట్రార్ చేయడం లేదన్నారు. మదనపల్లె టౌన్ 3వవార్డు గొల్లపల్లె హరిజనవాడలో హ్యాండ్ బోర్ చెడిపోయిందని, ఆరునెలలుగా మున్సిపల్ అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. ములకలచెరువు మండలం, గుడిపల్లి గ్రామం చెరువు కిందపల్లెలోని చెన్నప్పగారిగడ్డ శోత్రియ భూములను ఎస్సీ, ఎస్టీలకు పంపిణీ చేయాలని రైతులతో కలిసి డీఏఓ రాఘవేంద్రకు ఏపీ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తోపుకృష్ణప్ప వినతిపత్రం సమర్పించారు.

ప్రజావసరాలకు భిన్నంగా ప్రభుత్వ నిర్ణయాలు

– బహుజన సేనరాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు


మాట్లాడుతున్న బహుజనసేన శ్రీచందు

మదనపల్లె : రాష్ట్రంలోని పేద ప్రజలకు విద్య, వైద్యం సామాజిక అవసరాలని, ఈ అంశాలపై ప్రభుత్వ బాధ్యత కూడా అంతే బాధ్యతాయుతమైన అవసరమని, ఇందుకు భిన్నంగా కూటమి ప్రభుత్వం నిర్ణయాలు ఉన్నాయని బహుజనసేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు తెలిపారు. సోమవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..మదనపల్లె మెడికల్ కాలేజీ భవనాలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 70 శాతం పూర్తయ్యాయని, నేడు ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయన్నారు. ప్రపంచ బ్యాంకు పాలసీ అయిన పబ్లిక్ ప్రవేటు పార్టనర్ పద్ధతిలో మెడికల్ కళాశాలను ప్రైవేట్ పరం చేయాలని టీడీపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. తంబళ్ళపల్లి, పుంగనూరు, వాయల్పాడు నియోజకవర్గ ప్రజలు వైద్య సహాయం కోసం మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికే వస్తారన్నారు. సమావేశంలో బహుజనసేన రాష్ట్ర నాయకులు గిన్నెల మనోహరరెడ్డి, మూడే రూపక్ నాయక్, రెడ్డి సోట్ట భానుప్రకాశ్, మావిళ్ళ వెంటేష్, సిద్దిగాళ్ళ నరేష్ పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు

బి.కొత్తకోట: పేదల పక్కా గృహ నిర్మాణాలు వేగవంతం చేయడంలో వెనుకబడిన ముగ్గురు ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు హౌసింగ్ డీఈఈ వై.వెంకటరెడ్డి షోకాజ్ నోటీసులను జారీ చేశారు. దీనికి వివరణ ఇవ్వడంతో పాటు నిర్మాణాలు వేగవంతం చేయడం, లక్ష్యాలను పూర్తి చేసేలా కృషి చేయాలని కోరారు. బి.కొత్తకోట మండలంలో బయ్యప్పగారిపల్లికి చెందిన బి.తమేశ్వర్‌రెడ్డి, నందిశెట్టి వీధి సచివాలయానికి చెందిన యు.అర్జున్, ములకలచెరువు మండలం కాలువపల్లి సచివాలయానికి చెందిన కోసువారిపల్లి ప్రశాంత్‌లకు నోటీసులు జారీ చేశారు.

'వేల గొంతులు.. లక్షల డప్పులు' విజయవంతం చేయండి

పీలేరు : ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న వేల గొంతులు.. లక్షల డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఎస్పీ జాతీయ నాయకులు సొట్ట నరేంద్రబాబు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుడ్డు రామకృష్ణ అన్నారు. సోమవారం పీలేరులో జరిగిన ఎమ్మార్పీఎస్ సమావేశంలో వారు మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా మంద కృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్నారని తెలిపారు. వేల గొంతులు.. లక్షల డప్పుల కార్యక్రమానికి ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి విద్యార్థులు, యువకులు, నిరుద్యోగులు, ఉద్యోగస్తులు చంకన డప్పు వేసుకొని పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

నాయకత్వ లక్షణాలపై శిక్షణ


మాట్లాడుతున్న నరసింహారెడ్డి

మదనపల్లె సిటీ : విద్యార్థులకు నైతిక విలువలు, మానవతా విలువలు, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, సేవాభావం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు జిల్లా స్కౌట్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక జీఆర్టీసీ ఉన్నత పాఠశాలలో కబ్ మాస్టర్లు, ఫ్లాక్‌లీడర్లకు శిక్షణ కార్యక్రమం ముగిసింది. శిక్షణలో రాష్ట్ర స్థాయి అధికారులు పాల్గొని ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఏ విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని, పాఠశాలల్లో విద్యార్థులకు ఎటువంటి అంశాలలో ఏ విధంగా శిక్షణ ఇవ్వాలో తెలియజేశామన్నారు. ఈనెల 21 నుంచి 27వతేదీ వరకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, ఏఎల్‌టీ ఉమాపతి, కబ్‌మాస్టర్స్ ఇమాంసాబ్, రామకృష్ణ, ఫ్లాక్ లీడర్ సుధారాణి, జ్ఞానోదయ పాఠశాల కరస్పాండెంట్ కామకోటి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి సర్వేకి ప్రజలు సహకరించాలి


కుష్టువ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

కలికిరి: ఇంటింటి కుష్టువ్యాధి సర్వేకి ప్రజలు సహకరించాలని మేడికుర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి కావ్యగంధ కోరారు. సోమవారం ఆమె కుష్టువ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 20న ప్రారంభమైన సర్వే ఫిబ్రవరి 2వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. కుష్టు వ్యాధిని ముందస్తుగా గుర్తిస్తే నివారణ సులభతరమవుతోందన్నారు. స్పర్శ లేని మచ్చలు, రాగి రంగులో వుండే మచ్చలు ఉండి మచ్చల ప్రాంతంలో వెంట్రుకలు లేకుండా, నొప్పి లేకుండా ఉంటాయన్నారు. ఇలాంటి మచ్చలుంటే ప్రజలు సర్వేకి వచ్చిన సిబ్బందికి చెబితే అటువంటి వారికి ఉచితంగా మందులు అందజేయనున్నట్లు తెలిపారు. ఏపీఎంజేపీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కలికిరి గ్రామ పంచాయతీ చెరువుముందరపల్లిలో ప్రజలకు తెలియజేశారు. హెచ్ఈ రఫీ, ఎంఎల్‌హెచ్‌పీలు నాగవేణి, సైరాభాను, ఏఎన్ఎంలు రమాదేవి, నఫీసా, ఆశాలు పాల్గొన్నారు.

మానవత సంస్థకు విరాళం

పీలేరురూరల్ : మానవత సంస్థకు విశ్రాంత ఉపాధ్యాయురాలు లక్ష్మీదేవి రూ.10 వేలు విరాళం అందజేశారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సద్దల కృష్ణయ్య జ్ఞాపకార్థం ఆయన సతీమణి లక్ష్మీదేవి సోమవారం విరాళం మొత్తాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవతా సంస్థ చేస్తున్న సేవ కార్యక్రమాలకు తనవంతు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. మానవత సంస్థ నిర్వాహకులు శెట్టి సుబ్రమణ్యం, వెంకటసురేష్, కృష్ణమూర్తి, పోతంశెట్టి రమేష్, రహత్‌బాషా, అక్రంబాషా, అశోక్‌కుమార్, నాగరాజ తోపాటు కృష్ణయ్య కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన

కలికిరి: చండీయాగంలో భాగంగా సోమవారం స్థానిక ఎల్లమ్మ ఆవరణలో మహిళలు భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆవరణలో అర్చకులు అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేసి చండీ పారాయణం చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శివకోటి శ్రీమహాలక్ష్మీ శ్రీపీఠం వ్యవస్థాపకులు శ్రీశ్రీశ్రీ అప్పాస్వామి చే మంగళవారం ఉదయం ఎల్లమ్మకు అభిషేకం, చండీ యాగం, పూర్ణాహుతి కార్యక్రమాలు జరుగుతాయని, భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ ధర్మకర్త అశోక్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆలయ నిర్వాహకులు మధుసూదన్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

కేజీబీవీ ఎస్ఓ శైలజను సస్పెండ్ చేయాలి

– సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు

మదనపల్లె : బాలికలతో వెట్టిచాకిరీ చేయిస్తున్న కేజీబీవీ (కస్తూర్బా పాఠశాల) ఎస్ఓ శైలజను సస్పెండ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో... సమగ్ర శిక్షా, పీఎం పోషణ్ సామాజిక తనిఖీ బృందం 2024 జూన్ నుంచి డిసెంబర్ వరకు సంబంధించి గత కొన్ని రోజులుగా ప్రభుత్వ, రెసి డెన్షియల్ స్కూళ్లను తనిఖీ చేస్తోందన్నారు. ఈ క్రమంలో పెద్ద తిప్పసముద్రం కస్తూర్బా గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన సందర్భంగా ఎన్నో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయని అన్నారు. విద్యార్థుల చేత వెట్టి చాకిరీ చేయించడమే కాకుండా, కుల వివక్ష చూపుతున్న ఎస్ఓపై శైలజపై ఎస్సీ,ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చెయ్యాలని డిమాండ్ చేశారు.

రక్తదానం

కలికిరి (వాల్మీకిపురం): రక్తదానం ప్రాణదానంతో సమానమని సామాజిక కార్యకర్త సాగుబడి లావణ్య రెడ్డి అన్నారు. తన కుమారుని పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని నల్లవీర గంగాభవాని ఆలయ ఆవరణలో సోమవారం ఆమె రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18సం.లు వయస్సు నిండిన ఆరోగ్య వంతులు ప్రతి ఒక్కరు రక్తదానం చేయవచ్చన్నారు.

సరస్వతమ్మ సేవలు మరువలేనివి

– వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్


సరస్వతమ్మ కుటుంబసభ్యులు, గ్రామస్తులతో నిసార్‌అహ్మద్

మదనపల్లె : మండలంలోని వలసపల్లె సర్పంచ్ సరస్వతమ్మ అందించిన సేవలు మరువలేనివని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. సోమవారం వలసపల్లెలో సరస్వతమ్మ సంవత్సరీకం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, సరస్వతమ్మ కుమారుడు నాగరాజరెడ్డితో కలిసి పంచాయతీ అభివృద్ధికి ఆమె చేసిన కృషిని, పార్టీకి అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో వలసపల్లె గ్రామప్రజలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సామాజిక సేవలకు డాక్టరేట్

మదనపల్లె : భారత్ వర్చువల్ యూనివర్సిటీ ఫర్ పీస్ అండ్ ఎడ్యుకేషన్, సామాజిక సేవ(సోషల్ సర్వీస్) విభాగంలో పీవీకే ఫౌండేషన్ వ్యవస్థాపకులు మర్రిపాటి రమేష్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. బెంగళూరులో సోమవారం జరిగిన కార్యక్రమంలో యూనివర్సిటీ అధికారులు డాక్టరేట్‌ను ప్రదానం చేస్తే మర్రిపాటి రమేష్ దాన్ని తన తండ్రి మర్రిపాటి వెంకటరమణకు అంకితమిచ్చారు.

నారాయణ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

మదనపల్లె సిటీ: అనంతపురం జిల్లాలోని నారాయణ జూనియర్ కాలేజీ విద్యార్థి చరణ్ మృతికి కారకులైన ఆ విద్యా సంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక కదిరిరోడ్డులోని రంగనాథ ఐటీఐ వద్ద నిరసన తెలియజేశారు. ఫీజులు చెల్లించకపోతే తరగతులకు అనుమతించబోమని, బోర్డు పరీక్షలు రాయటానికి హాల్‌టిక్కెట్లు ఇవ్వమని విద్యార్థులను బెదిరిస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆఫ్రిద్ ఆరోపించారు. విద్యార్థి చరణ్ మృతికి కారకులైన నారాయణ విద్యా సంస్థలపై క్రిమినల్ కేసులు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సమీర్, జయబాబు, విష్ణు, జస్వంత్, గణేష్, నరేష్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

పెద్దతిప్పసముద్రం: మండలంలోని తుమ్మరకుంటలో సోమవారం యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరు వైదేహీ సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఉచితంగా కేన్సర్ పరీక్షలతో పాటు సాధారణ వైద్య పరీక్షలకు విశేష స్పందన లభించింది. 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా ఎంపికైన 20 మందికి బస్సు సౌకర్యం కల్పిస్తూ ఉచితంగా ఆపరేషన్ చేస్తామని డాక్టర్ లోకేష్ భరణి హామీ ఇచ్చారు. శిబిరాన్ని సందర్శించిన ఎస్ఐ రవికుమార్, ఎంఈఓ గౌస్‌పీర్‌లు కూడా సాధారణ వైద్య పరీక్షలు చేయించుకుని సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, సభ్యులను అభినందించారు.

పన్నులు చెల్లించాలి

కురబలకోట: సకాలంలో ఇంటి, నీటి పన్నులు చెల్లించాలని మండలంలోని అంగళ్లు గ్రామ కార్యదర్శి టి. ఉదయ్‌కుమార్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ , వ్యాపారులు పంచాయతీకి చెల్లించాల్సిన లైసెన్స్ ఫీజులు బాధ్యతగా చెల్లించాలన్నారు.

క్లుప్తంగా

ఎంఈఓకు సన్మానం

పీలేరు : గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఎంఈవో అవార్డు అందుకున్న పీలేరు ఎంఈవో లోకేశ్వర్ రెడ్డిని సోమవారం స్థానిక ఎమ్మార్సీలో ఎంఈవో పద్మావతి తో పాటు సీఆర్పీలు, ఉపాధ్యాయులు దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో సీఆర్పీలు మురళీధర్‌రాజు, నాగరాజ, అశోక్, మాధవి, తాజూన్, సత్యనారాయణ, ఉపాధ్యాయులు సుబ్రమణ్యం, ధరనిజ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపు

కురబలకోట: అంగళ్లు జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం నుంచి గురువారం వరకు ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గంగయ్య, అంగళ్లు గ్రామ కార్యదర్శి ఉదయ్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తారన్నారు. కొత్త ఆధార్ కార్డుల కోసం బర్త్ సర్టిఫికెట్ తప్పనిసరి అన్నారు. ఫింగర్ ప్రింట్ అప్‌డేట్, అడ్రస్సు మార్పు, ఆధార్‌లో మార్పులకు మొబైల్ నెంబరు లింక్ అయి ఉండాలన్నారు. అవసరమైన వారు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

జాపాన్‌కు మిట్స్ విద్యార్థులు

కురబలకోట: జపాన్ ఐజు యూనివర్సిటీ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఇంటర్న్‌షిప్‌కు అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ విద్యార్థులు పల్లవి, మానస, ఆయేషా, సాయి గణేశ్వరి, బిందుశ్రీ, ఇందు ఈశ్వర్, జస్వంత్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండు నెలల పాటు ఇంటర్న్‌షిప్ నిర్వహిస్తారని తెలిపారు.

రూ.2.73లక్షల హుండీ ఆదాయం

తంబళ్లపల్లె: మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో భక్తులు హుండీల ద్వారా కానుకలు చెల్లించారు. సోమవారం టీటీడీ ఏఈఓ గోపినాథ్, ఆలయ ఇన్స్‌పెక్టర్ దుష్యంత్‌కుమార్ ఆధ్వర్యంలో పరకామణి లెక్కింపు జరిగింది. రూ.2,73,320 అక్టోబర్ నుంచి నాలుగు నెలల ఆదాయం వచ్చినట్లు టీటీడీ అధికారులు తెలిపారు.

ఉల్లాస్‌పై శిక్షణ

రామసముద్రం : మండలంలోని వెలుగు వీఓలకు వయోజన విద్యాకార్యక్రమాలు(ఉల్లాస్)కు సంబంధించి ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ భానుప్రసాద్ మాట్లాడుతూ.. ఉల్లాస్ ద్వారా 15 సంవత్సరాలు దాటిన నిరక్షరాసులను అక్షరాసులుగా తీర్చిదిద్దాలన్నారు. మండలంలో ఆసక్తి ఉన్న నిరక్షరాస్యులు.. వలంటీర్లుగా ఉన్నటువంటి వెలుగు వీఓలను సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. శిక్షణ నిమిత్తం టీచర్ లెర్నింగ్ మెటీరియల్(టీఎల్ఎం) పంపిణీ చేశామన్నారు. శిక్షణలో ఏపీఎం సాంబశివ, సీసీలు, వీఓ లీడర్లు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఏఈగా మస్తాన్

రామసముద్రం : మండల ట్రాన్స్‌కో ఏఈగా మస్తాన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సబ్ ఇంజినీరింగ్‌గా ఉన్న మస్తాన్‌కు ఇన్‌చార్జ్ ఏఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఆయనకు ఏఈగా పదోన్నతి రావడంతో రామసముద్రం రెగ్యులర్ ఏఈగా బాధ్యతలు చేపట్టారు. ఆయనకు ట్రాన్స్‌కో సిబ్బంది, పలువురు రైతులు శుభా కాంక్షలు తెలిపారు. విద్యుత్ సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తానని పేర్కొన్నారు.

ప్రయాణికులు ఆర్టీసీని ఆదరించాలి

మదనపల్లె సిటీ: ప్రయాణికులు ఆర్టీసీని ఆదరించాలని ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక బస్టాండు నందు మదనపల్లె-బి.కొత్తకోట రూట్‌లో లక్కీడ్రాను విద్యార్థి తీశారు. విజేతల వివరాలను డీఎం ప్రకటించారు. సావిత్రమ్మ, స్వర్ణలత, వెంకటరంగారెడ్డి డిపో వద్దకు వచ్చి బహుమతులు తీసుకోవాలన్నారు. ప్రయాణికుల కోసం ఆర్టీసీ ఇటీవల నూతన బస్సు సర్వీసులు ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో సీఐ రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచితంగా వైద్యసేవలు

తంబళ్లపల్లె: మదనపల్లె వెంకటేశ్వర హార్ట్ మల్టిస్పెషాలిటీ ఆస్పత్రి డాక్టర్ బాలకిషోర్, మనోజ్ క్లినిక్ రామాంజులు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. హార్ట్ స్పెషాలిస్టు డాక్టర్ బాలకిషోర్ గుండెకు సంబంధించిన సమస్యలు, ఈసీజీ, బీపీ, షుగర్ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సుమారు 100 మంది రోగులు వైద్య శిబిరంలో వైద్య సేవలు పొందారు. వైద్యులకు రోగులు కృతజ్ఞతలు తెలిపారు.

కాలేజీ అభివృద్ధికి కృషి

మదనపల్లె సిటీ: ప్రభుత్వ బాలికల కాలేజీ ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి కాలేజీకి అభివృద్ధి ఎనలేని కృషి చేశారని కాలేజీ అధ్యాపకులు కొనియాడారు. సోమవారం కాలేజీలో ఉత్తమ ప్రిన్సిపాల్‌గా ఎంపికైన బాలకృష్ణమూర్తికి అభినందన సభ ఏర్పాటు చేశారు. కాలేజీలో ఉత్తమ ఫలితాలు అందించడమే కాకుండా కాలేజీ అభివృద్ధికి తనవంతు సేవలు అందించారన్నారు. కాలేజీ విద్యార్థిని తుహూరా సమర్ రిపబ్లిక్‌డే వేడుకల్లో భాగంగా అట్‌హోం కార్యక్రమానికి ఎంపిక కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సాయి శంకర్‌రెడ్డి, రెడ్డప్పరెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.